క్లుప్తంగా

కౌంటింగ్ శిక్షణకు హాజరుకావాలి



పామర్రు: కౌంటింగ్ శిక్షణకు అందరూ హాజరుకావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బూసి శ్రీదేవి అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గానికి సంబంధించి మచిలీపట్నం నిర్మల హైస్కూల్లో ఆదివారం జరగనున్న ఎన్నికల కౌంటింగ్ శిక్షణ తరగతులకు ఎంపిక చేసిన అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీ ఏజెంట్లు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు. తప్పనిసరిగా నిర్దేశించిన సమయానికి శిక్షణ తరగతుల కేంద్రానికి చేరుకోవాలని ఆమె కోరారు.

సమాజసేవతో ఆత్మ సంతృప్తి



పామర్రు: సమాజసేవలో ప్రజా ప్రతినిధులు అంకిత భావంతో పనిచేస్తే ప్రజల మన్ననలు పొందటంతో పాటు ఆత్మ సంతృప్తి పొందవచ్చని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ అన్నారు. స్థానిక వాసవీ వృద్ధ శరణాలయంలోని వృద్ధులకు శనివారం అన్నదానం చేశారు. పామర్రు వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని మహిళా ప్రతినిధులు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ప్రవేశించి రాణించాలన్నారు. సర్పంచ్ గోట్రు విజయభారతి, మహిళాప్రజా ప్రతినిధులు రాయవరపు శాంతకుమారి, కె.రాజ్యలక్ష్మి, కుందేటి రాణి, నవుడు శ్రీలక్ష్మి, పల్లికొండ రత్నకుమారి, ఎన్‌నాగ పద్మిని, పామర్రు మానవత సంస్థ ప్రతినిధులు పీఎంఎస్ ప్రసాద్, వెంకటనారాయణ, భరతుడు, శ్రీనివాసరావు, రామారావు, శివ, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గుడివాడరూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కౌంటింగ్ రోజున మండలంలో ఎటువంటి గొడవలు, ఘర్షణలు జరగకుండా ముందస్తుగానే అన్ని చర్యలు చేపట్టామని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎల్ఎస్ఎన్ మూర్తి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4వ తేదీన కౌంటింగ్ సమయంలో మండలంలో ఎటువంటి గొడవలు జరగకుండా భద్రత కల్పించామన్నారు. ఇప్పటికే ఎన్నికల కోడ్‌తో పాటు 144సెక్షన్ కూడా అమలులో ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రాజకీయ పార్టీలు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ప్రశాంత వాతావరణంలో జరిగిన పోలింగ్ విధంగానే కౌంటింగ్ సమయంలో కూడా ప్రశాంత వాతావరణంగా ఉండాలని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలి

పామర్రు: సమాజం సుభిక్షంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ పేర్కొన్నారు. పామర్రు కొండిపర్రు అడ్డరోడ్డు వద్ద శ్రీ కలౌకపి దండి వినాయక క్షేత్రంలో నూతనంగా నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ పాద పీఠం వద్ద విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా గోసంరక్షణ కమిటీ అధ్యక్షుడు ఆరేపల్లి నాగరాజు ఆధ్వర్యంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రతిపౌరుడు ధర్మం వైపు నడవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ప్రతినిధులు వర్రే రాజశేఖర్, భూపతిరాజు సుబ్బరాజు, బంటుమిల్లి నాగరాజు, పీఎంఎస్‌ప్రసాద్, వెంకటనారాయణ, రామారావు, శ్రీనివాసరావు, శ్రీదేవి పాల్గొన్నారు

వైభవంగా లక్ష మల్లెల కుసుమార్చన



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి లక్ష మల్లెల కుసుమార్చన శనివారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచన, పంచగవ్యప్రాసన, ఏకాదశ రుద్రాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించి లక్షమల్లెల కుసుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిని, స్వామివారి మూలవిరాట్‌ను మల్లెలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య పర్యవేక్షణ చేయగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



ఉంద్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద వీరాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ



గుడివాడ దాసాంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు



అభయాంజనేయ స్వామికి పూజలు



గుడివాడ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు



పమిడిముక్కలలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు



అల్లినగరంలో పూజలందుకున్న ఆంజనేయస్వామి

గుడివాడ టౌన్: పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు యడవల్లి విజయభాస్కర్ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.

– స్థానిక పెద ఎరికపాడులోని దాసాంజనేయ స్వామి దేవస్థానంలో తమలపాకుల అర్చన చేశారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కావూరి శ్రీధర్, కె.రాజగోపాలరావు, ఎంవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

– స్థానిక పెద్దవీధిలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో అర్చకులు ఎం. శ్రీకృష్ణకుమార్ శర్మ, ఎ. సమీర్‌కుమార్‌శర్మ, జె.బాలకృష్ణ శర్మ, సత్య వరప్రసాద్, బి. శేషాచలశర్మ, ఆలయ నిర్వాహకులు పి.పద్మావతి, జి.ప్రియ అనురాధ, జి.సత్యనారాయణ, ఆర్. శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు చింతల భాస్కరరావు, కె.ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని పెదపారుపూడి, దోసపాడు, మోపర్రు గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పెదపారుపూడి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోపర్రు అభయాంజనేయ స్వామి, దోసపాడు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వాడవాడలా హనుమజ్జయంతి

పామర్రు: వైశాఖ మాసం బహుళ దశమిని పురస్కరించుకుని హనుమజ్జయంతిని వాడ వాడలా శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని జమీదగ్గుమిల్లి గ్రామంతో వేంచేసియున్న శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ఆలయంలో విశేషంగా పూజలను నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.ఆలయ కమిటీ సభ్యులు కాకర్ల సీతారామాంజనేయదాసు, శీతాల శ్రీనివాసరావు, ఉమ్మడిశెట్టి నాని పాల్గొన్నారు. రాపర్ల గ్రామంలో వేంచేసియున్న వీరాంజనేయస్వామి ఆలయంలో జయంతి సందర్భంగా ఆలయంలో పంచామృతాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కాకర్ల నాగభూషణం, విజయలక్ష్మి దంపతులు ఆలయ కమిటీ సభ్యులు కాకర్ల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన లక్ష నాగవల్లీ పూజ

స్థానిక ఉంద్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామిని లక్ష తమల పాకులతో(నాగవల్లీ)తో ప్రత్యేకంగా పూజలు చేశారు. రుత్వికుల ఆధ్వర్యంలో ఈ లక్ష తమలపాకుల పూజలను వైభవంగా నిర్వహించామని ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు తెలిపారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన దత్తత ఆలయం రెడ్డిపాలెం శ్రీ అభయాంజనేయ స్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ సురేష్ ఆధ్వర్యంలో స్వామికి సహస్రనామార్చనతో పాటు కల్యాణ వేడుకలను వేద మంత్రోచ్చరణ నడుమ పండితులు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పమిడిముక్కలలో.

పమిడిముక్కల: మంటాడ, కపిలేశ్వరపురం, హనుమంతపురం అడ్డరోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, ముళ్లపూడి, పమిడిముక్కల, చోరగుడి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హనుమంతపురం అడ్డరోడ్డు, పమిడిముక్కల్లో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

కైకలూరులో..

కైకలూరు: హనుమాన్ నామ స్మరణతో ఆంజనేయ స్వామి ఆలయాలు శనివారం మార్మోగాయి. కైకలూరు మీసాల వెంకన్న, ఏలూరు రోడ్ సెంటర్, గాంధీబొమ్మ, కోరుకొల్లు రోడ్ సెంటర్లలో పురాతన ఆంజనేయ ఆలయాల వద్ద ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయ గౌరవాధ్యక్షులు టీకి జయాచారి, అధ్యక్షులు టీకి వెంకటసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సింహాద్రి ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షులు టీకి నాగలింగాచారి, ఉప ప్రధాన కార్యదర్శి తుపాకుల సుబ్బారావు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మండవల్లి, అల్లినగరం, పెరికెగూడెం సిరామిక్స్ కంపెనీ, లింగాల గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని వడాలి, చినకామనపూడి, విశ్వనాద్రిపాలెం, బొమ్మినంపాడు, ముదినేపల్లి పెద్దరామాలయం, చిగురుకోట స్వామివారి ఆలయాల్లో జయంతి ఉత్సవాలు ప్రారంభించారు. శ్రీహరిపురం దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామికి తమలపాకుల అర్చన చేశారు. ముదినేపల్లి మారుతీనగర్‌లోని స్వామివారి ఆలయంలో మండల ఆర్యవైశ్యసంఘం నేతల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆంజనేయస్వామికి డీఎన్నార్ పూజలు



కైకలూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆటపాక, నాగాపురం ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ దక్కాలని కోరారు. కార్యక్రమంలో తలారి జాన్, పిఏసియస్ అధ్యక్షులు పంజా రామారావు, ఉప సర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు సింగం శెట్టి రాము, కన్నా రమేష్, చొప్పాల రాము, తమ్మిశెట్టి కొండా, ముక్కెళ్ల పెద్దిరాజులు, కన్నా సాంబశివరావు, సిద్దాబత్తుల శ్రీరామమూర్తి, కన్నా బాబు పాల్గొన్నారు.

కలిదిండిలో..



కలిదిండి: మండల వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. కలిదిండి, సానా రుద్రవరం, కోరుకొల్లు, కొండగి, గుర్వాయపాలెం, కొళ్లపాలెం, ఆరుతెగలపాడు, తాడినాడ, పలు గ్రామాల ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కొళ్లపాలెం, తాడినాడ గ్రామాల్లో అభయ ఆంజనేయస్వామిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దివ్యమైన ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ కలగాలని డీఎన్నార్ కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సాగి చిన్నబ్బాయిరాజు, అల్లూరి సూర్యనారాయణరాజు, పెన్మెత్స ఏడుకొండలరాజు, సాగి వెంకట్రాజు, జమ్ము సురేష్ పాల్గొన్నారు.

ధనియాలపేట న్యూ కాలనీలో కార్డెన్ సెర్చ్

గుడివాడరూరల్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ సూచనల మేరకు వన్‌టౌన్ సీఐ కె.ఇంద్రశ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టణంలోని ధనియాలపేట న్యూకాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున ఎటువంటి గొడవలు జరగకుండా కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐలు గౌతమ్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గడ్డి దహనంతో దిగుబడికి చేటు



పంట పొలంలో గడ్డిని దహనం చేస్తున్న దృశ్యం (ఫైల్)

గుడివాడరూరల్: వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండటంతో రైతులు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. వరి కోతలకు హార్వెస్టర్లను ఉపయోగిస్తుండటంతో వరి గడ్డి వినియోగం తగ్గిపోయింది. కేవలం పశువులు ఉన్నవారు మాత్రమే వరి గడ్డిని సేకరించి, మిగతా వారు పొలంలోనే విడిచిపెట్టేస్తున్నారు. అనంతరం పొలాన్ని పంటలకు సిద్ధం చేసే క్రమంలో వడిగడ్డిని దహనం చేస్తున్నారు. అయితే అవగాహన లోపంతో అన్నదాతలు ఇలాంటి తప్పిదాలు చేస్తే భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలా చేయడం వలన పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాదని చెబుతున్నారు. పొలంలో గడ్డి దహనంతో పంటలకు కీడు చేసే పురుగులను తినే వానపాములు, కీటకాలు నశించే ప్రమాదం ఉంది. అలాగే భూమికి సేంద్రియ పీచు పదార్థాలుగా ఉపయోగపడే అవశేషాలు, ఖనిజ లవణాలు నశిస్తాయి. వీటితో పాటు ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎక్కువ మొత్తంలో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది.

ఇలా చేస్తే మేలు..

పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. పంటకోత పూర్తయిన తర్వాత మిగిలిన పంటల అవశేషాలను భూమిలో మురగబెట్టి దుక్కిలో కలిపి దున్నాలి. ఇలా చేయడం వలన వరిగడ్డి భూమిలో మురిగి సేంద్రియ కర్బనం పెరుగుతుంది. దీని వలన తర్వాత సాగు చేసే పంటకు మేలు చేకూరుతుంది. యూరియా, సూపర్‌పాస్ఫేట్, పొటాష్‌ను కలిపి పంట సాగు చేసుకునే ముందు చల్లితే పొలంలో మిగిలిన కొయ్యలు, వరిగడ్డి రెండు వారాల్లోనే మురుగుతాయి.

భూసారం తగ్గుతుందని తెలియదు

పంటకోతకు యంత్రాలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి మిగిలిన కొయ్యలు, గడ్డిని తగలబెడుతున్నాం. ఇలా చేస్తే భూసారం తగ్గుతుందని తెలియదు. దీనిపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

– కైలా అశోక్, రైతు తటివర్రు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

పంట భూముల్లో గడ్డిని, వరి కొయ్యలను దహనం చేస్తే భూమి సారాన్ని కోల్పోతుంది. అవసరం లేని గడ్డిని భూమిలోనే కలిపి దున్నితే సేంద్రియ ఎరువుగా మారి, భూమికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. గడ్డి దహనంతో వాతావరణం కాలుష్యం అవుతుంది. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– బి.అనంతలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారి

ఘనంగా గంగానమ్మ జాతర



అమ్మవారి ఘటం కుండను ఊరేగిస్తున్న భక్తులు

రాపర్ల(పామర్రు): గ్రామంలో వేంచేసియున్న గంగానమ్మ తల్లి ఆలయ జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తొలిరోజు అమ్మవారికి ఊరి కట్టడిని చేసి విశేష పూజలు చేశారు. శనివారం గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఘటం కుండను, పోతురాజు గడలను ఊరేగింపు జరిపారు. మేళ తాళాలతో కనక తప్పెట్లతో మంగళ వాయిద్యాలతో డీజే సౌండ్ సిస్టమ్స్‌తో చిన్న, పెద్ద అని తేడా లేకుండా అందరూకలిసి జాతరలో ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. ఇంటింటికీ గంగానమ్మ ఘటం కుండలో చద్ది నివేదనలను సమర్పించారు. పోతురాజు గడకు నూతన వస్త్రాలను సమర్పించి కొబ్బరికాయలు నివేదన చేశారు. ఆదివారం ఆలయంలో భక్తులు తమ మొక్కులను తీర్చుకోవడం జరుగుతుందని జాతర నిర్వాహకులు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు నగదు, షీల్డ్ అందజేసిన ఫౌండేషన్ ప్రతినిధులు

పమిడిముక్కల: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పిన్నమనేని తపస్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులు, షీల్డ్ అందజేశారు. చోరగుడి, పమిడిముక్కల, జీసస్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను అభినందించి నగదు బహుమతులు, షీల్డ్ అందజేశారు.

ఆలయంలో లైసెన్సు హక్కుకు వేలం

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో వివిధ కేటగిరిల్లో షాపుల లైసెన్సు పొందేందుకు శనివారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు మాట్లాడుతూ దేవస్థానంలో పలు షాపుల నిర్వహణకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 1, 2024 నుంచి మే 31, 2026 సంవత్సరం రెండు సంవత్సరాలకు గాను అత్యధికంగా వేలం పాట పాడినవారి వివరాలు తెలియజేశారు. దేవస్థానానికి చెందిన వాహన పార్కింగ్ నందు ప్రకటన బోర్డు ఏర్పాటు చేసుకునే హక్కును మోపిదేవికి చెందిన ఆదిలక్ష్మి రూ.26 వేలకు హెచ్చు పాటకు లైసెన్సు పొందియున్నారు. సంచార ఫొటోలు తీసుకును లైసెన్సు శివరామపురానికి చెందిన బీడీఆర్ ప్రసాద్ రూ.1 లక్ష 62 వేలకు లైసెన్సు పొందారు. మిగిలిన పాటలకు తిరిగి వేలం పాటలు నిర్వహించేది తరువాత తెలియజేస్తామని ఏసీ తెలిపారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



జమీగొల్వేపల్లిలో మ్యూజికల్‌చైర్ ఆడుతున్న విద్యార్థులు



గుడివాడ గ్రంథాలయంలో బొమ్మలు గీస్తున్న చిన్నారులు

జమీగొల్వేపల్లి(పామర్రు): ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించామని గ్రంథాలయాధికారి వి.నాగసురేష్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆటల వలన శారీరక వ్యాయామాలతో పాటుగా మానసిక వికాసం కలుగుతుందన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు దీవి వంశీ కృష్ణ పాల్గొన్నారు.

పామర్రులో ..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు క్రాఫ్ట్ నేర్పించినట్లు గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి తెలిపారు. విద్యార్థులకు మ్యాథ్స్ ఫార్ములాలను నేర్పించినట్లు పేర్కొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వివిధ స్థాయిలలోని చిన్నారులు ఈ పోటీలో పాల్గొన్నట్లు గ్రంథాలయ అధికారి పి. శాంతి తెలిపారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథపఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకులు వెనిగళ్ల ప్రతాప్ విద్యార్థులకు సూచించారు.

విద్యార్థులకు నీతి కథల బోధన

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు శనివారం నీతికథలను బోధించారు. స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాలసుందరం ఈ నీతి కథలను బోధించి బాలలు ఏ విధంగా వ్యవహరించాలో తెలియజేశారు. చిన్ననాటి నుంచే మంచి ప్రవర్తన, పెద్దలపై గౌరవభావం కలిగి ఉండాలన్నారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు

కలిదిండి: ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోరుకొల్లు గ్రంథాలయాధికారి ఆర్. రాఘవులు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కోరుకొల్లు గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాపై అవగాహన, కలిదిండి శాఖా గ్రంథాలయంలో నీతి కథలను చదివించడం వంటి కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. కలిదిండి శాఖా గ్రంథాలయాదికారి జె.రమేష్‌బాబు మాట్లాడుతూ కథలు చదవడంతో ఊహాశక్తి పెరుగుతుందన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: గ్రంథాలయ విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి పర్వీన పేర్కొన్నారు. మండవల్లి గ్రంథాలయంలో శనివారం పిల్లలకు పాడుపు కథలు, నీతి కథలు నేర్పించారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

పెదపారుపూడి: మండలంలోని పెదపారుపూడి, వెంట్రప్రగడ, యలమర్రు, మోపర్రు, వానపాముల తదితర గ్రామాల్లో శనివారం ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఉపాధి హామీ ఏపీఓ స్ఫూర్తి తెలిపారు. 19 గ్రామాల్లో సుమారు మూడు వేల మందికూలీలు ఉపాధి హామీ పనిలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని ఏపీఓ తెలిపారు.